

సీఎంకు.. వెల్‌ఫేర్..!



కోటి విలువైన 'టయోటా వెల్‌ఫైర్' కారు కొనుగోలుకు సిద్ధం

కాలినొప్పి లేని ప్రయాణం కోసం..

7





కాసుల్లేని.. కార్పొరేషన్లు..!

- స్థానిక ఎన్నికలు నిర్వహించని ప్రభుత్వం
- పాలకమండలి లేక గ్రాంట్లు కట్
- 43 నగరపాలక సంస్థలకు నిధుల కరువు
- కుంటుపడుతున్న అభివృద్ధి



మైసూరు కార్పొరేషన్ కార్యాలయం

బెంగళూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ తప్పిదం అభివృద్ధికి అడ్డంకిగా మారింది, పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ఎన్నికలు జరపనందున స్థానిక సంస్థల్లో పాలన కుంటుపడింది. గ్రామస్వరాజ్యం సాధ్యం కావాలంటే స్థానికసంస్థలు బలోపేతం కావాలని ఏడు దశాబ్దాల కిందటే మహాత్మాగాంధీ ఆశించారు. కేంద్రం, రాష్ట్రాల్లో భిన్నమైన పార్టీల ప్రభుత్వాలు కొనసాగే తరుణంలో అభివృద్ధికి ఆటంకం కలుగుందని గ్రామపంచాయతీలకు, పురపాలికెలకు కేటాయించే గ్రాంట్లలో ప్రభుత్వాల జోక్యం పర్యవేక్షణకు మాత్రమే అనేలా చేశారు. ఇంతటి నిబంధనలు ఉన్నా సకాలంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగకపోవడం, పాలకవర్గాలు లేని కారణంగా ప్రగతికి ఆటంకం ఏర్పడుతోంది. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపేందుకు రాష్ట్రప్రభుత్వం నిరుత్సాహం చూపుతున్న కారణంతో మైసూరు, శివమొగ్గ, తుమ కూరుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 43 నగర పాలక సంస్థల అభివృద్ధికి అడ్డంకిగా మారింది. స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులు లేని కార ణంగా కేంద్రప్రభుత్వం 15వ ఫైనాన్స్ కమిష న్ గ్రాంట్లను పొందేందుకు అనర్హత వేటు వేసినట్లయ్యింది. ఆర్థిక కమిషన్ ద్వారా విడుదలయ్యే గ్రాంట్లు నిలిచిపోవడంతో అభివృద్ధి చేపట్టే అవకాశం లేకుండా పోతోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక లోటు వెంటాడుతోంది. నగర పాలికెలకు ప్రత్యేకంగా గ్రాంట్లు కేటాయించి పరిస్థితి లేకుండా పోతోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలే గ్రాంట్లు లేక అభివద్ధి సాధ్యం కావడం లేదని, ఏటా ఎమ్మెల్యేలకు కేటాయించాల్సిన గ్రాంట్లు అందడం లేదని బహిరంగంగా విమర్శిస్తున్న సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో ప్రత్యేకంగా నగర పాలికెలకు గ్రాంట్లు విడుదల చేయడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ప్రభుత్వం నేరుగా నగర పాలికెలలో అభివృద్ధి గురించి మాట్లాడేది లేకుండా పోతోంది. మున్సిపల్ డైరెక్టరేట్ స్థానిక సంస్థల ముఖ్యఅధికారులకు ప్రత్యేకంగా లేఖ రాశారు. హామీలు ఇచ్చి వెంటనే అభివృద్ధి పనులు చేసేందుకు తగిన గ్రాంట్లు లేవని సూచించినట్లు తెలుస్తోంది.

కేంద్రంపైనే ఆరోపణలు..

కేంద్రప్రభుత్వం నుంచి గ్రాంట్లు రావడం లేదని, తమ వాటా జీఎస్టీ కూడా పూర్తిస్థాయిలో విడుదల చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం ఆరోపిస్తోంది. అయితే సకాలంలో ఎన్నికలు జరపకుండా వాయిదాలు వేయడం ద్వారా కోట్లాదిరూపాయలు నగర పాలికె, మున్సిపాలిటీలకు నిధులు రాకుండా చేసినట్లయ్యింది. మైసూరు, శివమొగ్గ, తుమకూరు మహానగర పాలికెలతోపాటు నగరసభ, పురసభ, పట్టణ పంచాయతీలతోపాటు 43 స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లను విడుదల చేయాల్సి ఉండేది. కానీ ప్రజాప్రతినిధులు ఉంటే మాత్రమే గ్రాంట్లు సాధ్యమవుతాయి.

గ్రాంట్లు వచ్చేవరకు పనులకు బ్రేక్

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నగర పాలక సంస్థలకు గ్రాంట్లు విడుదల కావడం లేదని, నగరపాలకసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వమే 15వ ఫైనాన్స్ కమిషన్‌లో ఎటువంటి పనులు చేపట్టరాదని సూచించింది. గ్రాంట్లు వచ్చేవరకు పనులు నిలిపివేయాలని అధికారులకు ప్రభుత్వం మార్గదర్శకాలు చేసింది. కాగా మైసూరు మాజీ మేయర్ శివకుమార్ అభిప్రాయం ప్రకారం మైసూరు పాలికెకు కేంద్రప్రభుత్వం నుంచి సుమారు రూ.65 కోట్లు విడుదల కావాల్సి ఉండేదని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు జరపనందున సాధ్యం కాలేదన్నారు. ఎన్నికల ఎఫెక్ట్ ప్రభుత్వంపై పడడం బాధాకరమన్నారు.

రూ.3,995 కోట్ల కేటాయింపు

రాష్ట్రానికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా నగర, పట్టణ పంచాయతీ సంస్థలకు 3,995 కోట్ల రూపాయలు కేటాయించారు. నగరపాలక సంస్థలకు ప్రత్యేకంగా గ్రాంట్లు కేటాయిస్తూ సిఫారసు చేశారు. 2024-25 సంవత్సరంలో గ్రామపంచాయతీలకు 2637 కోట్లు, నగర పాలక అనుబంధ సంస్థలకు 1358 కోట్లు కేటాయిస్తూ సిఫారసు చేశారు.



నిధుల కోత పడనున్న పాలక సంస్థలివే..

మహానగర పాలికెల్లో మైసూరు, శివమొగ్గ, తుమకూరు, స్థానిక సంస్థల్లో బాగల్కోట జిల్లాలో లోకాపుర, శిరూరు, బెళగావి జిల్లాలో అంకలగి, ఘటనప్రభ, కబ్బూరు, కాగవాడ మచ్చె, పీరణవాడి, బెంగళూరు గ్రామీణ జిల్లాలో బాశెట్టిహళ్ళి, బెంగళూరు నగరలో అత్తిబెలె, బొమ్మసంద్ర, చిక్కబాణవార, హుణసమారనహళ్ళి, మాదనాయకనహళ్ళి, కోనప్పన అగ్రహార, దొడ్డతేగూరు, చిక్కమగళూరు జిల్లాలో అజ్జంపుర, దక్షిణకన్నడ జిల్లాలో బజ్పె, కడబ, కిన్నిగోళి, దావణగెరెలో న్యామతి, హావేరి జిల్లాలో రణహట్టి, కలబురగి జిల్లా కలగి, కమలాపుర, వాడి, యడ్రామి, మైసూరు జిల్లాలో బోగావి, హూటగళ్ళి, కడకోళ, రమ్మనహళ్ళి, శ్రీరాంపుర, కోలారు జిల్లాలో వేమగల్, రామనగర జిల్లాలో హారోహళ్ళి, శివమొగ్గ జిల్లాలో హొళెహొన్నూర, హనహట్టి, ఉడుపి జిల్లాలో బైందూరు, ఉత్తరకన్నడ జిల్లాలో మంకి, విజయ పుర జిల్లాలో తికోట, బబలేశ్వర స్థానిక సంస్థలకు గ్రాంట్లలో కోత పడనుంది.



శివమొగ్గ కార్యాలయం

తండ్రీకొడుకులదే అజమాయిషీ..!

- యడియూరప్ప, విజయేంద్రపై యత్నాళ్ ఆరోపణలు
- షోకాజ్ నోటీసుపై అధిష్టానానికి 12పేజీల వివరణ



బెంగళూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పార్టీపై పూర్తిగా తండ్రీ కొడుకులే పెత్తనం చెలాయిస్తున్నారని, పలు నియోజకవర్గాల్లో స్థానిక నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని యత్నాళ్ మండిపడినట్లు తెలుస్తోంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష స్థానం నుంచి విజయేంద్రను మార్చు చేయాలనే డిమాండ్‌తో రెబెల్‌గా మారిన సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్‌యత్నాళ్ అధిష్టానానికి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఇటీవల పార్టీ కేంద్ర క్రమశిక్షణా కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన మేరకు యత్నాళ్ వివరణ ఇచ్చారు. 12 పేజీల సుదీర్ఘ లేఖను మంగళవారం అధిష్టానానికి పంపారు. ప్రధానంగా పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, సీనియర్ నేత యడియూరప్పలపై పలు ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. తనతో పాటు ఉన్నవారు ఎవరూ పార్టీకి వ్యతిరేకం కాదని, కానీ శివరాం హెబ్బార్, ఎస్‌టీ సోమశేఖర్ వంటివారు పార్టీ ఎమ్మెల్యేలుగా కొనసాగుతూనే కాంగ్రెస్ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి వ్యతిరేకులకు ఎందుకు నోటీసులు జారీ చేయరనేతే తమ డిమాండ్ అన్నారు. పార్టీ కోసం పనిచేసే తనకు నోటీసులు ఇచ్చారని, కానీ వ్యతిరేకులకు వెనుకేసుకొస్తున్నవారు ఎవరన్నారు. పార్టీ అభ్యర్థులను ఓడించి బలి ఇచ్చినవారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో లింగాయత నియోజకవర్గాల్లో ఎందుకు ఓడామని ఆత్మావలోకనం చేయలేదన్నారు. డీసీఎం డీకే శివకుమార్‌తో ఒప్పందం పెట్టుకున్నారని, జిల్లా అధ్యక్షుల ఎంపికలో సీనియర్ల అభిప్రాయం తీసుకోలేదని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ పూర్తిగా తండ్రీ కొడుకుల చేతిలో ఉందని, పార్టీ కోసం పనిచేసినవారిని నిర్లక్ష్యం చేశారన్నారు. ఓటమికి వారిదే బాధ్యత అన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులివ్వండి..!

- మేకెదాటు నిర్మాణంతో బెంగళూరు తాగునీరు, విద్యుత్ కష్టాలకు చెక్
- జాతీయస్థాయి జలవనరుల మంత్రుల సదస్సులో డీసీఎం డీకేశీ



సదస్సులో ప్రసంగిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులకు కేంద్రప్రభుత్వం వెంటనే అనుమతులతోపాటు గ్రాంట్లు ఇవ్వాలని డీసీఎం, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డీకే శివకుమార్ డిమాండ్ చేశారు. భవిష్యత్తుకోసం నీరు కాపాడడం మనందరి కర్తవ్యమని అభిప్రాయపడ్డారు. రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌లో జరుగుతున్న '2047నాటికి భారత్ జలసమృద్ధి దేశం' పేరిట రెండో అఖిలభారత స్థాయి జలవనరుల మంత్రుల సదస్సులో మంగళవారం డీసీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ కేంద్రజలశక్తి మంత్రిత్వ కార్యాలయం ప్రాధాన్యతకు అనుగుణంగా జలవనరుల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలన్నారు. మేకెదాటు ప్రాజెక్టు నిర్మాణానికి డీపీఆర్‌ను పరిగణించి సీడబ్ల్యూసీ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. బెంగళూరు నగరానికి శాశ్వతంగా తాగునీటితోపాటు 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా మేకెదాటు నిర్మించదలిచామన్నారు. 2023-24 కేంద్ర బడ్జెట్‌లో భద్ర ఎగువ ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు ప్రకటించారని ఇప్పటివరకు అనుమతులు ఇవ్వలేదన్నారు. కేంద్ర పర్యావరణశాఖ వద్ద పెండింగ్‌లో ఉండే మేకెదాటుకు అనుమతులు ఇప్పించాలని కోరారు. ప్రపంచంలో 18శాతం జనాభా భారత్‌లో ఉన్నారని, అందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం ధ్యేయం కావాలన్నారు. పెరుగుతున్న నగరాలకు అనుగుణంగా సౌలభ్యాలను అమలు చేయాల్సి ఉందన్నారు. కర్ణాటక నీటి వినియోగంలో ప్రణాళికాబద్ధంగా ఉందన్నారు. కేంద్ర జలవనరులశాఖ మంత్రి వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉండే జలవనరుల ప్రాజెక్టుకు మోక్షం కలిగించాలని కోరారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు, తెలంగాణ మంత్రి ఉత్తమ్ రెడ్డితోపాటు వివిధ రాష్ట్రాల మంత్రులు పాల్గొన్నారు.

అరగంటలోనే... సంగీతా మొబైల్స్ డెలివరీ

- ఎక్స్‌ప్రెస్ డెలివరీ సేవలను ప్రారంభించిన ఎండీ సుభాష్‌చంద్ర

బెంగళూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ గాడ్జెట్ రంగంలో పేరొందిన సంగీతా మొబైల్స్ సంస్థ దక్షిణభారత వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో మొబైల్ బుక్‌చేస్తే అరగంటలోనే డెలివరీ చేసే ఎక్స్‌ప్రెస్ సేవలను సంస్థ ఎండీ సుభాష్‌చంద్ర లాంఛనంగా ప్రారంభించారు. నగరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేరళ రాష్ట్రం మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లోనూ స్మార్ట్‌ఫోన్‌తోపాటు ఇతర గృహోపకరణ వస్తువులను వినియోగదారుడి ఇంటికి చేరుస్తామన్నారు. ప్రజల సౌకర్యార్థం ఎక్స్‌ప్రెస్ డెలివరీ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. సంగీతా సంస్థ రిటైల్ మొబైల్‌రంగంలో నమ్మకం, విశ్వాసంతో ఐదు దశాబ్దాలుగా సేవలందిస్తోందన్నారు. సాధారణ లావాదేవీలనుంచి 3వేల కోట్ల రూపాయలు చేరేందుకు వినియోగదారుల విశ్వాసమే కారణమన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వెయ్యి స్టోర్‌ల లక్ష్యం పెట్టుకున్నామన్నారు. మహారాష్ట్ర, గోవాలలో సంగీతా సేవలను విస్తరింపచేయదలిచామన్నారు. గతంలో 47 నిమిషాలలో డెలివరీ చేసేవారమని, ఎక్స్‌ప్రెస్ డెలివరీ సేవలు అందుబాటులోకి తెచ్చి అరగంటలో వినియోగదారుడు కోరుకున్న మొబైల్‌ను సమకూరుస్తామన్నారు. సంగీతా ప్రయాణంలో ఇదో మహత్తరమైన సాధన అన్నారు. సంగీతా బ్రాండ్ ఒకప్పుడు ఆరంభమని, ప్రస్తుతం మార్కెట్‌లో కింగ్‌లా వినియోగదారుడి విశ్వాసం పొందామన్నారు. సంస్థ డైరెక్టర్ చందు, సంగీతా సంస్థ ముఖ్యులు భాగస్వాములయ్యారు.



ఎక్స్‌ప్రెస్ డెలివరీ సేవలను ప్రారంభిస్తున్న సంగీతా ఎండీ సుభాష్‌చంద్ర

హోంమంత్రి పరమేశ్వర్‌కు అధిష్టానం పిలుపు

- హుటాహుటిన ఢిల్లీకి పయనం



బెంగళూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న విభేదాలు, గ్రూపుల కట్టడికి అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలో అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరుతున్న తరుణంలో పార్టీ సీనియర్ నేత హోం మంత్రి పరమేశ్వర్‌ను ఢిల్లీకి రావాలని అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. ఈమేరకు మంగళవారం పరమేశ్వర్ హుటాహుటిన ఢిల్లీకి బయల్దేరారు. దళిత సామాజికవర్గానికి చెందిన మంత్రుల అల్పాహార భేటీ కావడం, ఇదే సందర్భంలో కేపీసీసీ అధ్యక్షస్థానం దళితులకు కేటాయించాలనే ప్రతిపాదన చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. మరో మూడు నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కానుంది. నాయకత్వమార్పు విషయమై తరచూ ఎవరికివారు అనుకూలంగా వ్యాఖ్యలు చేయడం కూడా భిన్నాభిప్రాయాలకు కారణమవుతోంది. సిద్దరామయ్యను సీఎంగా ఐదేళ్లు కొనసాగించాలని హోం మంత్రి పరమేశ్వర్ అభిప్రాయపడ్డారు. పరమేశ్వర్ ఇంట్లో జనవరి మొదటివారంలో నిర్వహించతలపెట్టిన దళిత సామాజికవర్గ మంత్రులు, ఎమ్మెల్యేల భేటీకి అధిష్టానం అభ్యంతరం తెలిపింది. అందుకు డీసీఎం డీకే శివకుమార్ కారణమని విమర్శలు వచ్చాయి. తాజాగా మంత్రి రాజణ్ణ అధిష్టానం, ఢిల్లీ నేతల పేర్లను దుర్వినియోగం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు పార్టీ, ప్రభుత్వంలో గందరగోళానికి కారణమవుతుందనే అధిష్టానం జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే పరమేశ్వర్‌కు ఢిల్లీ పెద్దలు ఎటువంటి సూచనలు చేస్తారనేది కీలకమవుతోంది.

అక్రమంగా అంగన్‌వాడీ ఆహార పదార్థాల నిల్వ

- హుబ్లీలో 18మంది కార్యకర్తల సహా 26మంది అరెస్టు

8

11న కనకదుర్గమ్మ సిడిబండి మహోత్సవం

- 2 లక్షల నుంచి 3 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం

ఖాళీ ఫ్లవర్..!

హోసూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): క్యాలీఫ్లవర్ ధరలు పడిపోవడంతో రైతులు విలవిలలాడుతున్నారు. హోసూరు జిల్లాలోని బాగలూరు, ఆవలపల్లి , కెలమంగలం, తళి, డెంకణీకోట ప్రాంతాల్లో క్యాలీఫ్లవర్ సాగు అధికంగా చేశారు. గత నెలలో ఒక్కో ఫ్లవర్ రూ.40, 50 పలకగా వారం రోజులుగా భారీగా ధరలు పడిపోయాయి. సోమవారం మార్కెట్లో మంచి రకం రూ.20 నుంచి రూ.30 పలికింది. హోసూరు నుంచి కోయంబత్తూరు, ఈరోడ్, చెన్నై, తదితర జిల్లాలకు ఎగుమతి అవుతున్నాయి. హోసూరు, బత్తలపల్లి కూరగాయల మార్కెట్‌నుంచి రోజూ కర్ణాటక, కేరళ సహా జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు లారీల్లో తరలిస్తారు. అయితే ధర పడిపోవడంతో లాభాల మాట దేవుడెరుగు..కనీసం కొనేవారే లేరని, జేబులు ఖాళీ చేసుకుని ఇంటికి వెళ్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ధర లేక పొలాల్లోనే వదిలేసిన కాలీ ఫ్లవర్ పంట

పరిష్కరిస్తా.. లేదంటే నా డబ్బులు ఇస్తా..!

శ్రీరామిరెడ్డి పథకం కార్మికులకు ఎమ్మెల్యే అమిలినేని హామీ

సమ్మె విరమించిన కార్మికులు.. తప్పిన తాగునీటి ముప్పు



శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం/అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సమ్మెకు దిగిన శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు భరోసా ఇచ్చారు. సమస్య గడువులోగా పరిష్కారమయ్యేలా చూస్తానని, లేదంటే కార్మికుల బకాయిలను తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. దీంతో మంగళవారం రాత్రి సమ్మె ప్రారంభించిన కార్మికులు.. బుధవారం విరమించారు. బకాయి ఉన్న ఆరు నెలల జీతాలు, పీఎఫ్ వెంటనే చెల్లించాలని కార్మికులు సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. కళ్యాణదుర్గం పంపుహౌస్ వద్ద బుధవారం బైఠాయించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫేజ్-1, ఫేజ్-4 పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 292 మంది కార్మికులు ఉన్నామని, తమకు ఆరు నెలల వేతనం, 30 నెలల పీఎఫ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించేదాకా సమ్మెను విరమించబోమని స్పష్టం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు వారికి మద్దతుగా నిలిచారు. బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. క్యాసీ, క్యాప కమిటీల ప్రతిపాదనలను ఉపసంహరించాలని, లీటరు బేస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. సమస్యలను అధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరించినా పట్టించుకోలేదని, అందుకే వారు సమ్మెకు దిగారని అన్నారు. ఎమ్మెల్యే అమిలినేని వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. ఈ నెలాఖరు లోపు.. లేదా మార్చి 3వ తేదీలోపు సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఏదైనా సమస్య తలెత్తి, గడువులోగా సమస్య పరిష్కారం కాకుంటే తన సొంత డబ్బుతో కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీనికి సమ్మతించిన కార్మికులు.. సమ్మె విరమించారు. పంప్ హౌస్‌లో మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. దీంతో ఉరవకొండ, కూడేరు, రాయదుర్గం, బెళుగుప్ప, మడకశిర, హిందూపురం ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారమైంది. చర్చల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, ఈఈ మురళీధర్‌రావు, డీఈ పాల్గొన్నారు.

అప్పుల పంట

- తగ్గిన కళింగర దిగుబడి
- వేసవిలోనూ ధర పతనం
- పెట్టుబడినీ కోల్పోతున్న రైతులు
- అప్పుల పాలయ్యామని ఆవేదన



వ్యాన్‌లోకి లోడ్ చేసిన కళింగర కాయలు



యాడికి వద్ద సాగుచేసిన కళింగర పంట

యాడికి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అన్నదాత ఆరుగాల కష్టం నష్టాలను మిగిల్చింది. ప్రస్తుత సీజన్‌లో కళింగర సాగుచేస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చు అనుకున్న రైతులు.. ప్రతికూల వాతావరణంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. పంట దిగుబడి, నాణ్యత తగ్గడంతోపాటు ధరలు కూడా పతనమయ్యాయి. అన్నదాత కష్టం నేలపాలైంది. మండలవ్యాప్తంగా సుమారు 400ఎకరాల్లో కళింగర పంట సాగు చేశారు. యాడికి, రాయలచెరువు, నగరూరు, లక్షుంపల్లి, చందన, కేశవరాయునిపేట తదితర గ్రామాల్లో కళింగర పంట పెట్టారు. కిలో విత్తనం రూ.28వేలతో కొనుగోలు చేసి, నాటారు. పంట పూత, పిందె వచ్చే సమయంలో చలి, మేఘావృత వాతావరణం దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపినట్లు రైతులు తెలిపారు. సస్యరక్షణ చర్యలు ఎన్ని చేపట్టినా అవి పంట దిగుబడిని పెంచలేకపోయాయి. ఎకరాకు 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉంది. ఈసారి 7 నుంచి 10 టన్నులు మాత్రమే వస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాలో కళింగర సాగుకు రూ.70వేల నుంచి రూ.90వేల వరకు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు దెబ్బతినడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు.

తెల్లబూజు... పొడ...

చలి ప్రభావం, ఆకాశం మేఘావృతమై ఉన్న వాతావరణ పరిస్థితులు కళింగర పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. కళింగర కాయలపై తెల్ల పొడ ఎక్కువగా ఉన్నట్లు రైతులు తెలిపారు. కళింగర కాయ లోపలి భాగంలో తెల్లబూజు ఏర్పడి కాయ చెడిపోతున్నట్లు వాపోతున్నారు. తెల్లబూజు కారణంగా కాయలోపల తొర్ర ఏర్పడి తినడానికి పనికి రాకుండా పోతున్నట్లు తెలిపారు. పొడవచ్చిన కాయలను వ్యాపారులు కొనడం లేదు.

ధర పతనం

కళింగర గతంలో టన్ను రూ.18వేల నుంచి 22వేల వరకు ధర పలికిందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 10టన్నుల దిగుబడి వచ్చినా రైతుకు లాభం వచ్చేది. ప్రస్తుత సీజన్‌లో ఎకరాకు పది టన్నుల దిగుబడి వస్తున్నా.. ధర అమాంతం పడిపోయింది. టన్ను కళింగర ధర రూ.7వేల నుంచి 8వేలలోపే పలుకుతోంది. ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడి కూడా దక్కదు. వెరసి రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న ధరల్లో పంట దిగుబడిని మార్కెట్‌కు తరలించలేక రైతులు స్థానిక వ్యాపారులకు విక్రయిస్తుండడం గమనార్హం.



పెట్టుబడి కూడా వచ్చేది కష్టమే..

2.50 ఎకరాల్లో కళింగర సాగు చేశా. రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. 25 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ప్రస్తుతం కళింగర టన్ను రూ.7వేల నుంచి 8వేలలోపే ధర పలుకుతోంది. పెట్టుబడి కూడా వచ్చేది కష్టమే. వాతావరణ ప్రభావంతో కళింగర దిగుబడి తగ్గింది. నాణ్యతలోపంతో ధర కూడా పడిపోయింది. దీంతో నష్టాలు తప్పట్లేదు.

-శేఖర్, రైతు, రాయలచెరువు

4.50 ఎకరాల్లో సాగు చేశా


4.50 ఎకరాల్లో కళింగర సాగుచేశా. వాతావరణ ప్రభావంతో పంట దిగుబడి తగ్గింది. కాయల నాణ్యతపై తెల్లపొడ, తెల్లబూజు ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో ధర కూడా తగ్గింది. కలింగర ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయితే ధరలు పెరుగుతాయి. లోకల్ మార్కెట్‌లో వ్యాపారులు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో ధరలు బాగా పతనమయ్యాయి.

-రవికుమార్‌రెడ్డి, రైతు, లక్షుంపల్లి



సూక్ష్మసాయమూ లేదాయె..!

- సూక్ష్మ పోషకాల పంపిణీని అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వం
- రైతులపై అదనపు భారం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



ముదిగుబ్బ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ పాలకులు.. చేతల్లో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. సబ్సిడీపై సూక్ష్మ పోషకాల పంపిణీని అటకెక్కించడమే ఇందుకు నిదర్శనం. కొత్త పథకాలను అమలు చేయకపోగా.. అప్పటికే రైతులకు అందుతున్న ప్రయోజనాలను అటకెక్కించి అన్యాయం చేశారు. టీడీపీ హయాంలో చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీపై సూక్ష్మపోషకాలు అందించేవారు. తద్వారా రైతులకు పెట్టుబడి భారం తగ్గేది. పంట దిగుబడులు ఆశాజనకంగా వచ్చి, లాభం చేకూరేది. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక ఆ సూక్ష్మసాయాన్ని అటకెక్కించింది. ఐదేళ్లలో రైతులకు సబ్సిడీపై సూక్ష్మపోషకాలు అందించిన దాఖలాలు లేవు. దీంతో రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలా రైతులపై అదనపు భారం పడుతోంది. అసలే వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోయిన తరుణంలో ఇది అదనపు భారంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా సూక్ష్మపోషకాలను సబ్సిడీకి అందజేయాలని రైతులు కోరుతున్నారు.

ఎంతో అవసరం

ప్రతి మొక్క తన జీవిత చక్రాన్ని పూర్తి చేసుకోవడానికి 19 మూలకాలను ఆహారంగా తీసుకుంటుంది. కొన్ని పోషకాలను ఎక్కువ మోతాదులో, మరికొన్నింటిని తక్కువగా వినియోగించుకుంటుంది. తక్కువ మోతాదులో తీసుకునే వాటిని సూక్ష్మ పోషకాలు అంటారు. జింకు, ఇనుము, రాగి, మాంగనీస్, బోరాన్, మాలిబ్డినం, క్లోరిన్, సోడియం, వెనేడియం, సిలికాన్ వంటివి సూక్ష్మ పరిమాణంలో మొక్కలకు అవసరమవుతాయి. ఇవి మొక్క ఎదుగుదలతోపాటు దిగుబడుల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయి. వీటి లోపం ఏర్పడితే దిగుబడులు తగ్గుతాయి. జిల్లాలో జింకు, బోరాన్ లోపాలున్న భూములే ఎక్కువగా ఉన్నట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. అలాగే క్షార గుణం ఉన్న నేలలను బాగు చేసేందుకు, వేరుశనగ పైరుకు జిప్సం వాడతారు. ఈ మూడు రకాల సూక్ష్మ పోషకాలను గత వైసీపీ ప్రభుత్వం కేజీ కూడా పంపిణీ చేయలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు భారం

సాధారణంగా జింకులోపం ఉన్న వరి పైరుకు ఎకరాకు 20 కిలోలు, ఇతర పైర్లకు 10 కిలోల జింక్ సల్ఫేట్ వేస్తారు. ఇలా మూడు పైర్లకు ఒకసారిగానీ, మూడేళ్లకోసారిగానీ వేయాలి. బోరాన్ లోపం ఉంటే ఎకరాకు కేజీ బోరాక్స్‌ను ఆఖరి దుక్కిలో వేస్తారు. నల్ల చవుడు నేలలో ఎకరాకు దాదాపు 200 కిలోల జిప్సం వేసి దున్నుతారు. వేరుశనగ పైరుకు జిప్సం ఎంతో ముఖ్యం. తాలు గింజలు లేకుండా కాయ ఊరడానికి, నూనె శాతం పెరగడానికి ఎకరాకి దాదాపు 200కిలోల జిప్సం వేయాలి. ఇవన్నీ రైతులపై అదనంగా పడుతున్న పెట్టుబడి ఖర్చులు. గతంలో టీడీపీ ప్రభుత్వం రెండున్నర హెక్టార్ల వరకు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీతో వీటిని అందించేది. ఒక్కోసారి వందశాతం సబ్సిడీ కూడా వర్తింపజేసేది. ఇది రైతులకు ఎంతో ఉపశమనం కలిగించేది. వైసీపీ అధికారం చేపట్టాక ఆ ఊసే మరిచింది. రైతులకు అన్యాయం చేసింది.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

సబ్సిడీపై సూక్ష్మ పోషకాలు అందించాలని రైతులు కోరడంతో ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపాం. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు సూక్ష్మ పోషకాలు అందించేలా కృషి చేస్తాం.

- సత్యనారాయణ, ఏడీఏ, కదిరి

నాణ్యమైన దిగుబడి



మామిడి, దానిమ్మ, కలింగర పంటలకు జిప్సం, జింకు ఇతర సూక్ష్మ పోషకాలు చాలా అవసరం. టీడీపీ హయాంలో వందశాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేశారు. వాటిని పంటకు అందించడం ద్వారా దిగుబడులు నాణ్యతగా వచ్చేవి. గత వైసీపీ ప్రభుత్వం సబ్సిడీపై సూక్ష్మ పోషకాల పంపిణీని పూర్తిగా నిలిపేసింది. బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయడం ద్వారా అదనపు భారం పడుతోంది. కూటమి ప్రభుత్వం సబ్సిడీతో సూక్ష్మ పోషకాలను రైతులకు అందించాలి.

- వెంకటరాముడు, రైతు, వలించెర్లోపల్లి

పంట దిగుబడి తగ్గుతోంది



గతంలో టీడీపీ ప్రభుత్వం వేరుశనగ పంటకు ఎకరాకు 200 కిలోల జిప్సం సబ్సిడీపై అందించింది. వైసీపీ అధికారం చేపట్టాక ఆ ఊసే మరిచిపోయింది. చిన్న, సన్నకారు రైతులు.. ప్రైవేటు దుకాణాల్లో కొనలేకపోతున్నారు. సూక్ష్మ పోషకాలు వినియోగించకపోవడంతో పంట దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం జిప్సం సబ్సిడీపై అందించాలి.

- నరేంద్ర, రైతు, ముదిగుబ్బ

జేఎన్టీయూ రెగ్యులర్ వీసీగా సుదర్శనరావు

ఎస్కేయూకి వారం ఆగాల్సిందే..



అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ రెగ్యులర్ వీసీగా ప్రొఫెసర్ సుదర్శనరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల వీసీలు రాజీనామా చేశారు. ఈ క్రమంలో గతేడాది జూలై 18న జేఎన్టీయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ సుదర్శనరావు బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు వర్సిటీలకు వీసీలను నియమించారు. అందులో భాగంగా జేఎన్టీయూ రెగ్యులర్ వీసీగా ప్రొఫెసర్ సుదర్శన రావుకు అవకాశం కల్పించారు.

వారం ఆగాల్సిందే...

రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది వర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించారు. వీటిలో ఎస్కేయూ లేకపోవడంతో ఉద్యోగ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. దీనికి తెరపడాలంటే మరో వారంరోజులు ఆగాల్సిందేనని తెలుస్తోంది. ఇన్‌చార్జి వీసీల నియామకం నుంచే జేఎన్టీయూ, ఎస్కేయూకి రెగ్యులర్‌గా ఎవరొస్తారన్న అంశంపై జోరుగా చర్చలు సాగాయి. అర్హత, అనుభవం తదితర కోణాల్లో ఎవరికి వారు బేరీజు వేసుకుంటూ వచ్చారు. జేఎన్టీయూకి ఇన్‌చార్జ్ పోయి రెగ్యులర్ పదం మాత్రమే మారుతుందన్న ఉద్యోగవర్గాల ఊహాగానాలు నిజమయ్యాయి. ఎస్కేయూకి ఇదే వర్తిస్తుందా? కొత్త పేరేమైనా వస్తుందా? అన్న చర్చలు వినిపిస్తున్నాయి.

మహిళ అదృశ్యం



వరలక్ష్మి (ఫైల్)

శెట్టూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన లింగారెడ్డి కుమార్తె వరలక్ష్మి (35) సోమవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని ఆమె తమ్ముడు మంజునాథరెడ్డి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వరలక్ష్మికి కర్ణాటకలోని తిప్పిరెడ్డిపల్లికి చెందిన నాగేంద్రతో వివాహమైంది. భర్తతో విభేదాల కారణంగా ఆమె కొన్నేళ్లుగా పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె కనిపించలేదని తమ్ముడు ఫిర్యాదు చేశాడు.

లైనింగ్ తంటా..!

- లైనింగ్‌తో చివరి ఆయకట్టుకు సాగు నీరు
- హంద్రీనీవాపై రైతుల్లో అపోహలు కలిగిస్తున్న వైసీపీ
- సీఎం వద్దకు వెళ్లాలని అధికారపార్టీ ఎమ్మెల్యేల సన్నాహాలు



ప్రారంభమైన హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వం హంద్రీనీవా ఆధునికీకరణ పనులు చేపట్టింది. జీడిపల్లి రిజర్వాయర్ ప్రధాన కాలువ నుంచి పుంగనూరు ఉపకాలువ దాకా లైనింగ్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు రూ.1368 కోట్ల నిధులు కేటాయించారు. తాజాగా రెండోదశ లైనింగ్ పనులను మొదలు పెట్టారు. అయితే ఐదేళ్ల పాలనలో హంద్రీనీవాను పట్టించుకోని వైసీపీ ఇప్పుడు లైనింగ్ నిర్మాణంతో భూగర్భ జలాలు అడుగంటి, పచ్చని పొలాలు బీళ్లుగా మారుతాయని ప్రచారం మొదలు పెట్టింది. రైతుల తరఫున అల్టిమేటం అంటూ ఇటీవల రాప్తాడు వైసీపీ మాజీ ఎమ్మెల్యే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు హంద్రీనీవా లైనింగ్ అంశాన్ని సీఎం చంద్రబాబు వద్దకు తీసుకెళ్లే సన్నాహాలు చేస్తున్నారు. కాలువకు లైనింగ్ నిర్మిస్తే నీటి వృథాను అరికట్టి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించవచ్చని హంద్రీనీవా ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. ఈ అంశంపై ఎదురవుతున్న సమస్యలపై ఓసారి చర్చించి, వైసీపీ విష ప్రచారానికి తెర వేయాలని హంద్రీనీవా ప్రధాన కాలువ వెళ్లే నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో

ఆరు లక్షల ఎకరాల సాగు లక్ష్యం

హంద్రీనీవాతో ఉమ్మడి జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ చేపట్టి నీటి వృథాను నియంత్రించి రిజర్వాయర్లతో పాటు చెరువులను నింపాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. కేటాయించిన నిధులతో వంద రోజుల్లో లైనింగ్ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు పనులు మొదలు పెట్టారు. లైనింగ్‌తో సాగు, తాగు నీటి సమస్యలు తీరేలా ప్రణాళికలు చేపట్టారు. ఇప్పటికే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువతోపాటు పుంగనూరు ఉపకాలువ లైనింగ్ పనులు మొదలు పెట్టారు. ఈ పనులు పూర్తయితే నీటి వృథా పూర్తిగా తగ్గిపోతుందని హంద్రీనీవా అధికారులు చెబుతున్నారు.

రైతులు, నాయకుల్లో లైనింగ్ టెన్షన్

జీడిపల్లి నుంచి రెండో దశ హంద్రీనీవా కాలువ ఉరవకొండ నియోజకవర్గంలో మొదలై రాప్తాడు, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల మీదుగా సాగుతుంది. ఈకాలువకు ఇరువైపులా రైతులు బోర్లు వేసుకుని పంటలు పండిస్తున్నారు. కిలోమీటర్ల దూరంలోని రైతులు సైతం హంద్రీనీవా కాలువ ద్వారా వచ్చిన నీటితో నిండిన చెరువుల్లోకి పైపు లైన్లు వేసుకుని భూములను సాగు చేసుకుంటున్నారు. ప్రధానంగా రాప్తాడు, పుట్టపర్తి నియోజకవర్గాల్లో కాలువ ఉండగా కదిరి నియోజకవర్గంలో ప్రధాన కాలువతోపాటు పుంగనూరు, కుప్పం ఉపకాలువ ఉంది. లైనింగ్ ఏర్పాటుతో కాలువ ఇరువైపులా భూగర్భ జలమట్టం అడుగంటుతుందని ఇటీవల ఆయా నియోజక వర్గాల్లో వైసీపీ నాయకులు రైతుల్లో అపోహలు కలిగిస్తున్నారు. ఈనేపథ్యంలో హంద్రీనావా కాలువ ద్వారా వచ్చిన నీటితో పంటలు పండించుకుంటున్న రైతుల్లో అలజడి మొదలైంది. లైనింగ్‌తో భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేల వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ మనుగడ కోసం లైనింగ్‌పై అపోహలు కలిగిస్తోన్న వైసీపీని ఎలా ఎదుర్కోవాలని రాప్తాడు, పుట్టపర్తి ఎమ్మెల్యేలు మల్లగుల్లాలు పడుతున్నారు. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో సాగునీటి కాలువలకు లైనింగ్ ఏర్పాటు చేసి, నీటి పొదుపు చర్యలు పాటిస్తుంటే ఉమ్మడి జిల్లాలో మాత్రం హంద్రీనీవా కాలువకు లైనింగ్ ఏర్పాటుపై అపోహలు కలుగుతున్నాయి.

మామిడి రైతుల కోసం..

50 శాతం సబ్సిడీతో రక్షణ కవచం



మామిడి ఫ్రూట్‌కేర్ కవర్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడి రైతులకు 50 శాతం సబ్సిడీతో ఫ్రూట్ కేర్ కవర్ పంపిణీ చేస్తామని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో 1000 హెక్టార్లలకు అవసరమైన మామిడి రక్షణ కవచం పంపిణీ చేయాలని లక్ష్యం విధించారన్నారు. ఒక్కో రైతుకు హెక్టారుకు 20వేల రక్షణ కవచం కవర్లు ఇస్తామన్నారు. ఒక్కో కవర్ పూర్తి ధర రూ.2లు కాగా సబ్సిడీతో రూ.1కి అందజేస్తామని తెలిపారు. ఈ ఫ్రూట్ కవర్‌ను మామిడి పిందే దశలో (నిమ్మకాయ, కోడిగుడ్డు పరిమాణంలో) ఉన్నప్పుడు కట్టాలన్నారు. ఈ ఫ్రూట్ కవర్ వాడటం ద్వారా ఊజీ ఈగ, మచ్చలు, తేనె మంచు పురుగు, తామర పురుగు తదితర తెగుళ్లను నివారించడంతోపాటు నాణ్యమైన పండ్ల దిగుబడి వస్తుందన్నారు. క్రిమి కీటకాలు పండ్లను నాశనం చేయకుండా, అధిక సూర్యరశ్మి నుంచి కూడా రక్షణ కల్పించవచ్చని వెల్లడించారు. ఫ్రూట్ కవర్‌ను వినియోగించడం ద్వారా పురుగుమందులు వాడాల్సిన అవసరం ఉండదన్నారు. కాయకుండే సహజ మంచి లక్షణాలను పెంచి, తొడిమ దృఢంగా తయారై, కాయ పరిమాణాన్ని పెంచడంతోపాటు కాయ సహజ రంగును పెంచుతుందన్నారు. మామిడి సాగు చేసే రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. ఫ్రూట్ కవర్ కావాల్సిన రైతులు స్థానిక ఉద్యాన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చీనీలో సస్య రక్షణ ఇలా..



చీనీ తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

రాప్తాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చీనీ పంటకు తెగుళ్లు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్ తెలిపారు. మండలంలోని హంపాపురం గ్రామంలో మంగళవారం రైతులతో కలిసి చీనీ తోటను పరిశీలించి, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ రాత్రి వేళ చలి, మంచు ఎక్కువగా ఉండటం, పగటి పూట ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటం వలన పడమర దిశలో ఉన్న చీనీ కాయలు ఎండ పొడకు గురవుతున్నాయన్నారు. ఎండ పొడ నివారణకు రైతులు సాకీయంగా కొమ్మలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. యూరియా 10 గ్రాములు ఒక్క లీటరు నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. అలాగే వారం తర్వాత లీటరుకు 20 గ్రాములు బట్టి సున్నం కలిపి స్ప్రే చేస్తే కాయలకు ఎండపొడతెగులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, గార్లదిన్నె మండలంలో రైతు సేవా కేంద్రం ద్వారా ఉద్యాన రైతులకు సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

యూట్యూబర్ మృతదేహం లభ్యం

హత్య అని అనుమానం

పోలీసుల అదుపులో అనుమానితుడు



రోదిస్తున్న తిరుమలరెడ్డి భార్య, కుమార్తె, కుటుంబ సభ్యులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఉదయం అదృశ్యమైన యూట్యూబర్ బోగాల తిరుమల రెడ్డి(42) మంగళవారం విగతజీవిగా కనిపించాడు. మండలంలోని బుగ్గ సంగాల వద్ద ఉన్న తన తోటకు తిరుమలరెడ్డి సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అయితే మార్గమధ్యంలో హంద్రీనీవా కాలువ పక్కన తిరుమల రెడ్డి ద్విచక్ర వాహనం ధ్వంసమై కనిపించింది. బైక్‌కు సమీపంలోనే తిరుమల రెడ్డికి చెందిన చెప్పులు, సెల్‌ఫోన్, డబ్బులు కనిపించాయి. తిరుమల రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై మిస్సింగ్ కేసును నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. గజ ఈతగాళ్లతో తిరుమలరెడ్డి ఆచూకీ కోసం హంద్రీనీవా కాలువలో వెతికించారు. మంగళవారం ఉదయం హంద్రీనీవా కాలువలో తిరుమల రెడ్డి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. ఘటనా స్థలానికి రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, కసాపురం ఎస్ఐ వెంకటస్వామి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. తిరుమల రెడ్డి మృతదేహాన్ని పరిశీలించగా కుడి కన్ను కందిపోయి, కుడి కాలు విరిగిపోయి కనిపించాయి. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వద్దకు తిరుమల రెడ్డి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున చేరుకున్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సంఘంలో పనిచేస్తూ ఆక్రమాల మీద ప్రశ్నిస్తే చంపేస్తారా అంటూ తిరుమల రెడ్డి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి భార్య కామేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు

తిరుమలరెడ్డి మృతిని హత్యగా భావించి, అనుమానంతో సంగాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు సోమవారమే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతడిని పోలీసులు విచారించగా తిరుమల రెడ్డిని హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. తన భర్త బుగ్గ సంగాలకు చెందిన కుమార్‌తో ఘర్షణపడ్డాడని మృతుడి భార్య సోమవారం అనుమానం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. బుగ్గసంగమేశ్వర దేవాలయం సమీపంలో నిందితుడి పొలం ఉంది. పొలం పక్కనే ప్రభుత్వ పోరంబోకు స్థలం ఉంది. ఈ స్థలంలో నిందితుడు మట్టి వేసి చదును చేశాడు. ఈ విషయంపై తిరుమల రెడ్డి అతడితో గతంలో గొడవ పడినట్లు తెలిసింది. ఈ విషయంగా తిరుమల రెడ్డి కలెక్టరు, తహసీల్దారుకు ఫిర్యాదు చేశాడు. కోర్టులో కేసు వేస్తానని తిరుమలరెడ్డి తనను బెదిరించినట్లు నిందితుడు పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. దీంతో పథకం ప్రకారం తిరుమల రెడ్డిపై దాడి చేసి, హత్య చేసినట్లు పోలీసు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది. వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఛత్రపతి శివాజీ (జయంతి)



ఛత్రపతి శివాజీగా పేరొందిన శివాజీ రాజే భోంస్లే 1630 ఫిబ్రవరి 19న మహారాష్ట్రలోని పూనె జిల్లాలో జన్మించారు. మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించారు. 1674లో జ్యేష్ఠ శుద్ధ త్రయోదశిన పట్టాభిషేకం జరిగిన సందర్భాన్ని హిందూ సామ్రాజ్య దివస్‌గా ఆచరిస్తారు. యుద్ధతంత్రాలలోనే కాక పరిపాలనా విధానంలోనూ అగ్రగణ్యులుగా పేరొందారు. మంత్రి మండలి, విదేశాంగ విధానం, గుఢచారి వ్యవస్థ వంటి వాటిని ఏర్పాటు చేశారు. ఎన్నో యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్రస్థలాలను ధ్వంసం చేయలేదు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా చూసేవారు. చక్కటి పాలనతో ప్రజల ఆదరణ పొందారు. సుమారు 300 కోటలు ఆయన అధీనంలో ఉండేవి. సాంకేతిక విలువలతో కూడిన దుర్భేధ్యమైన కోటలను నిర్మించడంలో ఖ్యాతి పొందారు. 1680 ఏప్రిల్ 3న కన్నుమూశారు.

గోపాలకృష్ణ గోఖలే (వర్ధంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు గోపాలకృష్ణ గోఖలే 1866 మే 9న జన్మించారు. సమాజ సేవకుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. పాశ్చాత్య రాజకీయాలపై అవగాహన కలిగారు. 1885 నుంచి 1905 వరకు మితవాదులు ప్రాబల్యం కల్గిన కాంగ్రెస్‌లో ప్రముఖపాత్ర వహించారు. 1902 నుంచి 1915 వరకు శాసనమండలి సభ్యుడిగా ఉన్నారు. 1905లో సర్వంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ ఏర్పాటు చేశారు. భారతీయులలో జాతయతా భావాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు. మహ్మద్ అలీ జిన్నా, మహాత్మాగాంధీలకు రాజకీయ గురువు. 1915 ఫిబ్రవరి 19న కన్నుమూశారు.

కె విశ్వనాథ్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత కాశీనాథుని విశ్వనాథ్ 1930 ఫిబ్రవరి 19న రేపల్లెలో జన్మించారు. తెలుగు సినిమా దర్శకుడు, కళాతపస్వి బిరుదాంకితులు. ప్రశస్తమైన సినిమాలను సృష్టించి తెలుగు సినిమాకు ఒక గౌరవాన్ని, గుర్తింపును తెచ్చిన మహోన్నతమైన వ్యక్తి. శంకరాభరణం, సప్తపది, స్వాతి ముత్యం, సాగరసంగమం, శృతిలయలు, సిరివెన్నెల, స్వర్ణకమలం, స్వయంకృషి, శుభలేఖ వంటివి ఎంతో ప్రముఖమైనవి. కొన్ని సినిమాల్లోనూ నటించారు. రఘుపతి వెంకయ్య పురస్కారం, దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం పొందారు. 2023 ఫిబ్రవరి 2న శివైక్యం చెందారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు : కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా అధికారి నితీశ్

రాయచూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవిలో నగరంతో పాటు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లాధికారి కే నతీశ్ తెలిపారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడిన డీసీ, ఇప్పటికే తాగునీటి ఎద్దడి తీవ్రస్థాయిలో ఉండే గ్రామాలను గుర్తించి తగిన కార్యాచరణ సిద్ధం చేసేందుకు జడ్పీ సీఈఓ కార్యాచరణ సిద్ధం చేశారన్నారు. నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా కృష్ణనది వద్దగల ఫిల్టర్ బెడ్ వద్ద నాల్గు అదనపు పంపుసెట్‌లను ఏర్పాటు చేసి నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల్లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చే గ్రామాలను ఇప్పటికే గుర్తించి ముందస్తుగా వాటికి తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కృష్ణనది పరివాహకంలోని 18 చెరువులను నీటితో నింపేందుకు ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లాధికారి తెలిపారు. నగరసభను మహానగర పాలికగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో పాలనపరమైన సమస్యలు తలెత్తకుండా నగరాభివృద్ధికి సంబంధించి నగరసభ ప్రత్యేక అధికారి, సిబ్బందితో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తు తగిన జాగ్రతలు తీసుకుంటున్నట్లు జిల్లాధికారి వెల్లడించారు. ఒపెక్ ఆస్పత్రిలో ఇప్పటికే కిమో థెరపి సేవలు అందుబాటులో ఉండగా రేడియేషన్ థెరపిని ప్రారంభించేందుకు తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం నిపుణులైన వైద్యులను నియమిస్తున్నట్లు జిల్లాధికారి తెలిపారు. రూ.2కోట్ల వ్యయంతో క్యాన్సర్ చికిత్స వ్యవస్థను మరింత పటిష్ఠం చేసినట్లు తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న జిల్లా పాలన భవనంలోకి మరో రెండు నెలల్లో పలు శాఖలను తరలిస్తున్నట్లు డీసీ వెల్లడించారు. రెండవ దశ పాలన భవన నిర్మాణానికి సంబంధించి రూ.25కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు డీసీ వివరించారు.

ఐజీ ఆఫీస్‌కు ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. రాయదుర్గం సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు, పెనుకొండ సబ్‌రిజిస్ట్రార్ వెంకటనాయుడును డెప్యుటేషన్‌పై ఆరు నెలల పాటు ఐజీ కార్యాలయంలో విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. ఉరవకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ జయదీప్, అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డిలను ఐజీ కార్యాలయానికి వెళ్లేలా ఆదేశాలందాయి. రాయదుర్గం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా అనంతపురం జాయింట్-2సబ్‌రిజిస్ట్రార్ యూనస్‌ను, పెనుకొండలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సురేష్ ఆచారికి అక్కడే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

రాజకీయ, సాహిత్యరంగాల్లో శేషగిరిరావు ఆదర్శప్రాయుడు

▸▸ శత జయంతి వేడుకల్లో మాజీ సీఎం వీరప్పమొయిలీ



పుస్తకావిష్కరణలో మాజీ సీఎం వీరప్పమొయిలీ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయ, సాహిత్యరంగంలో ప్రొఫెసర్ ఎల్ఎస్ శేషగిరిరావు ఆదర్శప్రాయులని, నా ఎదుగుదలకు ఆయన స్ఫూర్తి అని మాజీ సీఎం వీరప్పమొయిలీ పేర్కొన్నారు. శేషగిరిరావు శత జయంతి ఉత్సవాల ముగింపుసభ కన్నడ గెళెయర బళగ ఆధ్వర్యంలో కన్నడ భవన్‌లో సోమవారం రాత్రి జరిగింది. ముఖ్యులుగా పాల్గొన్న వీరప్పమొయిలీ మాట్లాడుతూ శేషగిరిరావు అంటూనే ఒక వ్యక్తిత్వం, పోరాట పటిమ, సాహిత్యాభిమానం కలిగినవారన్నారు. నా రచనలకు పరిశోధనలు, మార్గదర్శకాలు చేశాకనే విడుదల చేసేవారన్నారు. శేషగిరిరావు శతజయంతి ప్రభుత్వం చేపట్టాల్సి ఉండేదని అభిప్రాయపడ్డారు. గుండూరావు సీఎంగా ఉన్నప్పుడు తాను మంత్రిగా కొనసాగానని, ఆ తర్వాత ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వానికి ఉత్తమమైన మార్గదర్శకాలు చేశారన్నారు. పుస్తక ప్రాధికార అధ్యక్షుడిగా చేశాననే సంతోషం ఉందన్నారు. నాడోజ గో.రు. చన్నబసప్ప, డాక్టర్ సీఎస్ రామచంద్రన్, ప్రొఫెసర్ మల్లెపురం వెంకటేశ్ ముఖ్యులుగా పాల్గొనగా, కన్నడ గెళెయర బళగ సంచాలకులు రా.నం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఇదే సందర్భంగా కన్నడ విశేష సాహిత్యగిరి పుస్తకాన్ని ముఖ్యులు ఆవిష్కరించారు. వ్యాఖ్యాతగా డాక్టర్ రుద్రేశ్ అదరంగి వ్యవహరించగా డాక్టర్ మనుబళిగార్, శాస్త్రవేత్త సుదర్శన్ హెచ్ఎస్‌లు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై జాగృతి



జాగృతిలో న్యాయాధికారి మంజునాథాచారి తదితరులు

బాగేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బాలికలు, యువతుల రక్షణ, పోషణకు సంబంధించిన పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని పట్టణంలోని న్యూ హారిజాన్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. తాలూకా లీగల్ సెల్ అధ్యక్షుడు మంజునాథాచారి కార్యక్రమాన్ని ప్రారంభించారు. న్యాయసేవల ప్రాధికార, తాలూకా న్యాయవాదులసంఘం, స్త్రీ శిశుసంక్షేమ అభివృద్ధిశాఖ, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ సంయుక్తంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సుస్థిర సమాజం కోసం విద్యార్థులలో చట్టాలపై అవగాహన అవసరమని అభిప్రాయపడ్డారు. హక్కులు, విధుల గురించి మాత్రమే కాకుండా సమాజంలోని అంశాలపై అవగాహన అవసరమని న్యాయవాదులసంఘం నంజుండప్ప అభిప్రాయపడ్డారు. బాలికలపై దౌర్జన్యాలను నియంత్రించేందుకు, దుండగులకు కఠిన శిక్ష విధించేలా పోక్సో చట్టం రూపొందించబడిందన్నారు. కార్యక్రమంలో బీఈఓ వెంకటేశప్ప, కన్వీనర్ ఎస్ వెంకట్‌రామ్, వ్యాయామ ఉపాధ్యాయుడు రంగనాథ్, పాఠశాల ట్రస్టీ పృధ్వీరాజ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించండి



వార్షికోత్సవ వేదికపై అభయానందస్వామీజీ తదితరులు

విజయనగర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పాఠాలకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చక్కగా రాణించాలని విద్యార్థులకు రామకృష్ణ వివేకానంద వేదాంత ఆశ్రమానికి చెందిన అభయానందస్వామీజీ సూచించారు. సుంకదకట్టె విద్యానికేతన్ పబ్లిక్‌స్కూల్ 35వ వార్షికోత్సవం విస్తా 2025 కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ తమకు అభిరుచి కల్గిన రంగంలో సత్తా చాటుకోవాలని పాఠశాలకు, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో సంస్థ ముఖ్యులు మిథున్‌కుమార్, కెహెచ్ ధనంజయ, సీ కృష్ణప్ప, డీ గంగమ్మ, ఎంఈఎస్ విద్యాసంస్థల మాజీ ప్రిన్సిపాల్ గణేశ్‌భట్, నటుడు ప్రేమ్, నటి చందన సంకేత్, రశ్మి మిథున్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ఆర్ లతా, నిర్మల నవీన్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



స్వామివారికి విశేష అలంకరణ

చేళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకా పాలకేరి గ్రామంలో పురాతన లక్ష్మీ వేంకటరమణస్వామి ఆలయ జీర్ణోద్ధరణ నేపథ్యంలో స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ గోపుర పూజలు ఆది, సోమ వారాలలో రెండు రోజుల పాటు విశేషంగా కొన సాగాయి. ఆలయ ట్రస్టు సభ్యుడు శ్రీనాథ్‌రెడ్డి, బాలాజి, ఆర్యవైశ్యసంఘం సభ్యులు, గ్రామ ప్రముఖుల సహకారంతో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేపట్టారు. ఆలయంలో వేంకటరమణస్వామి, నాగదేవతలు, గణపతి దేవతలను ప్రతిష్ఠించారు. కళశ పూజలు, ఇతర పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉత్సవాలలో జేడీఎస్ పార్టీ నాయకులు హరినాథరెడ్డి, బాగేపల్లి ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేళూరు నుంచి పాలకేరి వరకు డబుల్‌రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు.

ధర్మరాయస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు రూ.1.5 లక్షల విరాళం



ట్రస్టు ముఖ్యులకు డీడీ అందజేస్తున్న దాత

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర సమీపంలోని చౌడదేనహళ్ళిలోగల ధర్మరాయస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణకు రూ.1.5లక్షలను ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ ప్రకటించింది. ధర్మస్థళ ధర్మాధికారి నేతృత్వంలో సంస్థ పలు సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా ఆలయ జీర్ణోద్ధరణకు 1.5 లక్షల రూపాయల డీడీని మంగళవారం సంస్థ బెంగళూరు గ్రామీణ జిల్లా డైరెక్టర్ ఉమార్ అబ్బా ఆలయ అభివృద్ధి కమిటీ పదాధికారులకు అందచేశారు. అనంతరం ఉమార్ అబ్బా మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ఇంతవరకు వివిధ సామాజిక సేవలకు తాలూకాలో రూ.12కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ప్రధానంగా పాలడెయిరీ భవనాలు, ఆలయాల జీర్ణోద్ధరణ, సముదాయ భవనాల నిర్మాణం, పాఠశాల భవనాలు, చెరువుల అభివృద్ధి సహా విద్యార్థులకు పలు పథకాలకింద స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామన్నారు. ధర్మరాయస్వామి దేవాలయ సమితి ట్రస్టు అధ్యక్షుడు ఎం సుబ్రమణి మాట్లాడుతూ ధర్మస్థళ సంస్థ ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల మహిళ అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు సమాజంలో మార్పుకు పాటు పడుతోందని కొనియాడారు. ఈ సందర్భంగా ధర్మస్థళ సంస్థకు చెందిన నాగేశ్‌గౌడ, శివశంకర్, ఇట్టంగూరు పార్వతి, ఆలయ సమితి ట్రస్టు కోశాధికారి మురుగేశ్, యమరె గ్రామపంచాయతీ సభ్యులు నాగరాజు, ఆలయ స్థల దాతలు చిన్నస్వామిరెడ్డి, ప్రముఖులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



చిత్రదుర్గ స్వామీజీకి సన్మానం



పురవీధులలో సేవాలాల్ ఊరేగింపు

చేళూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తాలూకాకేంద్రమైన చేళూరులో లంబాడీ సముదాయ గురువు సేవాలాల్ 286వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మద్దిరెడ్డిపల్లికి చెందిన గోపినాయక్ నేతృత్వం వహించారు. చిత్రదుర్గ బంజారాపీఠం స్వామీజీ సర్దార్ సేవాలాల్ ముఖ్యులుగా పాల్గొన్నారు. సేవాలాల్ గురువు చిత్రపటాన్ని పురవీధులలో ఊరేగించారు. లంబాడి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని సంప్రదాయ నృత్యాలు చేస్తూ సాగారు. . చిత్రదుర్గ పీఠాధిపతిని స్థానిక ప్రముఖులు ఆత్మీయంగా సత్కరించారు. తహసీల్దారు శ్రీనివాసులు నాయుడు, కాంగ్రెస్ ముఖ్యులు పీఆర్ చలం, శివానాయక్, సంఘం అధ్యక్షులు రంగె నాయక్, గోపినాయక్, శంకర నాయక్, భీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించాలి

▸▸ భక్తరహళ్ళి పాఠశాలలో చదువుల పండుగ



ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో చదువుపై మరింత ఆసక్తి పెంచేలా బీఎంవీ పాఠశాలలో క్లస్టర్ స్థాయి చదువుల పండుగ (కలికా హబ్బ) నిర్వహించారు. సీఆర్‌పీ సరితా నేతృత్వం వహించారు. పిల్లల్లో దాగియున్న ప్రతిభను వెలికితీసేందుకు సాధ్యమని అక్షరదాసోహ సహాయక డైరెక్టర్ ఆంజనేయ అభిప్రాయపడ్డారు. ఏడు విభాగాలుగా విభజించి ప్రతి అంశంలోనూ విద్యార్థి రాణించేలా కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. స్పష్టంగా చదవడం, చక్కగా రాయడం, చిన్నపాటి కూడికలు తీసివేతలు సులభంగా చెప్పేలా ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఈసీఓ మంజునాథ్, సమన్వయ అధికారి లక్ష్మినారాయణ్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శి కెంపేగౌడ, ఉపాధ్యక్ష మంజునాథ్, బీఆర్‌పీ మంజునాథ్, వేణుమాధవి, మళమాచనహళ్ళి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మోహిమబేగం, వెంకటేశ్, సీఆర్‌పీ హేమలత, భారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం



నోటు పుస్తకాలతో విద్యార్థుల బృందం

ముళబాగిలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు ఆకర్షణీయమైన బహుమతులతోపాటు ఘనంగా సన్మానం చేయనున్నట్టు ప్రగతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు జోగలకాప్షి మునేశ్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ ఆవరణలో తాలూకాలోని అన్ని ప్రభుత్వ, వసతి హైస్కూళ్లలో 1500మంది పదో తరగతి విద్యార్థులకు ఉచిత పరీక్షా పరికరాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. బీఈఓ ఎన్ రామచంద్ర మాట్లాడుతూ 2025లో తాలూకాలోని ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షా ఫలితాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చక్కగా బోధించారన్నారు. సమయం వృథా చేయకుండా పాఠ్యపుస్తకాలను, నోటు పుస్తకాలను సమగ్రంగా అధ్యయం చేయాలన్నారు. సమాజసేవకుడు మునేశ్ ప్రభుత్వ కళాశాల ప్రగతిపై ఆసక్తి అభినందనీయమన్నారు. బీఆర్‌సీ కన్వీనర్ పీ సోమేశ్, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, లక్ష్మయ్య, అంజలి, తాలూకా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వెంకటగిరియప్ప, ఉపాధ్యాయులు జగదీశ్, అరుణ్‌కుమార్, రహీం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా రెండోసారి వివేక్ సుబ్బారెడ్డి

▸▸ కోశాధికారిగా శ్వేతా రవిశంకర్





వివేక్ సుబ్బారెడ్డి, శ్వేతా రవిశంకర్

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడిగా వివేక్ సుబ్బారెడ్డి రెండోసారి గెలుపు సాధించారు. 2025-28 అవధికి గాను జరిగిన ఎన్నికల్లో వివేక్ సుబ్బారెడ్డి 6,820 ఓట్లు పొందడం ద్వారా గెలుపు సాధించారు. 4,518 ఓట్లు పొందిన ఏపీ రంగనాథ్ రెండోస్థానంలో నిలిచారు. ఇక కోశాధికారిగా శ్వేతా రవిశంకర్ విజయం సాధించారు. న్యాయవాదుల సంఘం ఏర్పడి ఆరు దశాబ్దాల తర్వాత మహిళా న్యాయవాది ప్రధాన కార్యదర్శి, కోశాధికారి వంటి కీలక హోదాలు సాధించలేదు. తొలిసారి శ్వేతా విజయం సాధించారు. 16మంది మహిళలు పోటీ చేయగా 1055 ఓట్ల ఆధిక్యంతో ఆమె గెలుపొందారు. న్యాయవాదిగా ఆమెకు 18ఏళ్ల అనుభవం ఉంది.

సీఎంకు వెల్‌ఫేర్

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య మోకాలినొప్పితో విధానసౌధతోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అనుకూలమైన కారును కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి మోకాలినొప్పికి చికిత్స పొందుతున్నారు. సాధారణ కార్లలో కూర్చోవడం వీలుకాకపోవడంతో 'టయోటా వెల్‌ఫైర్' కారును కొనుగోలు చేయనున్నారు. మంగళవారం అధికారిక నివాసం కావేరి నుంచి అదే కారులోనే విధానసౌధకు టెస్ట్ డ్రైవ్ ద్వారా సీఎం చేరుకున్నారు. క్యారవాన్ తరహాలో విశాలంగా ఉండే ఈ కారును ఆయన ఉపయోగించనున్నారు. ప్రస్తుతం ఆ కారు మార్కెట్‌లో రూ.1.20 కోట్లు ధరగా ఉన్నట్టు తెలుస్తోంది.

పెళ్లి కాలేదని... తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వయసు పైబడుతున్నా పెళ్లి కాలేదని ఆవేదనతో ఓ యువకుడు తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడగు జిల్లా విరాజ్‌పేట తాలూకాలో సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అయ్యంగేరి సణ్ణపులికోటు గ్రామ నివాసి బిపి అనిల్ కుమార్ అలియాస్ సతీశ్ (40) మృతి చెందిన వ్యక్తి. పీయూసీ దాకా చదివి వడ్రంగి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పదేళ్లుగా పెళ్లికోసం అన్వేషణ చేశాడు. కొన్ని చోట్ల పెళ్లి సంబంధాలు చూసి నిశ్చయం చేసుకునేవేళ రద్దు అయినట్టు తెలుస్తోంది. ఇతడితోపాటు ఇతడి అన్నకు కూడా పెళ్లి కాలేదు. అన్నకు వయసు పైబడిందని తమ్ముడు ప్రయత్నించినా ఎక్కడా సంబంధాలు కుదరకపోవడంతో జీర్ణించుకోలేక తుపాకీతో కాల్చుకుని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు విరాజ్‌పేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రూ.2.5 లక్షల ద్విచక్రవాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు


బంగారపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బంగారపేట పట్టణంలోని బస్టాండ్‌లో అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను ఎస్సై రాజణ్ణ విచారించగా చోరీకి పాల్పడిన విషయం వెలుగు చూసింది. ఇద్దరు దుండగులనుంచి రూ.2.50లక్షల విలువైన నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కేసును ఛేధించిన పోలీసు సిబ్బందిని కేజీఎఫ్ ఎస్పీ కేఎం శాంతరాజు అభినందించారు.

ఎయిమ్స్ ఏర్పాటుతోనే రాయచూరుకు న్యాయం

రాయచూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : విద్యాపరంగా అత్యంత వెనకబాటుతనానికి గురైన రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు చేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఉందని ఎయిమ్స్ స్థాపక ఏర్పాటు కోసం సాగిస్తున్న ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస అన్నారు. ఎయిమ్స్ ఏర్పాటుతోనే జిల్లాకు తగిన న్యాయం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎయిమ్స్ ఏర్పాటు కోసం అఖిల పక్షం, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం 1013వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ స్టేడియంలోని దీక్ష శిబిరం వద్ద ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాకు ఐఐటీ ఇస్తామని చెప్పిన పాలకులు దాన్ని ఇతర జిల్లాకు తరలించడం జిల్లా ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు ఏనాడు దీని పై నోరు విప్పకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు. ఈ ప్రాంత ప్రజల పట్ల వారికున్న నిబద్ధతను వారి మౌనం తెలియజేస్తుందన్నారు. నాయకులకు ఎన్నికల పట్ల ఉన్న ధ్యాస అభివృద్ధి పై లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి విద్యసంస్థను రాయచూరులో ఏర్పాటు చేసి ఈ జిల్లాకు న్యాయం చేయాల్సిన పాలకులు కనీసం ఎయిమ్స్ ఏర్పాటు ద్వార పేదరికం ఎక్కువగా ఉన్న జిల్లాలో వైద్య సేవలకు విస్తృత అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకోసం తమ పోరాట సమితి చేస్తున్న సుదీర్ఘ కాల పోరాటాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకుని ఈ ప్రాంత ప్రజల అవసరాన్ని గుర్తించి తగిన న్యాయం చేయాలన్నారు.



ఎంజీ స్టేడియంలో ఆందోళనలో పాల్గొన్న నాయకులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1611.45	1,587.80
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,110	165
నీటి నిల్వ (టీఎంసీలు)	40.51	9.29

వైభవంగా సంగమేశ్వర రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



అలంకరణలో సంగమేశ్వరస్వామి

కంప్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని ఇటిగి గ్రామంలో ప్రసిద్ధి గాంచిన సంగమేశ్వర స్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి జలాభిషేకం, బిల్వార్చన, పుష్పాభిషేకం తదితర పూజలు చేపట్టారు. బుక్కసాగర విశ్వరాధ్య శివాచార్యులు, కల్మఠ ఆధీన ప్రభుస్వాములు స్వామివారికి పూజలు చేపట్టారు.

అండర్‌పాస్‌కు మరమ్మతులు



నీటిని తోడేస్తున్న కార్మికులు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నర క్రితం సుమారు రూ.2కోట్లతో సత్యనారాయణ పేట అండర్ పాస్ అభివృద్ధి పనులను కార్పొరేషన్ చేపట్టింది. వర్షపునీరు వెళ్ళేందుకు ఏర్పాట్లు లేక ఫిర్యాదులు అందడంతో మంగళవారం కార్పొరేషన్ అధికారులు కార్మికులతో కాలువను క్లీన్ చేయించి వాహన రాకపోకలకు అవాంతరం లేకుండా చేశారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

- పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి
- రాష్ట్ర పిల్లల హక్కుల రక్షణ కమిషన్ అధ్యక్షుడు నాగణ్ణ గౌడ



మాట్లాడుతున్న కమిషన్ అధ్యక్షుడు నాగణ్ణ గౌడ

బళ్లారి గాంధీనగర్/కంప్లి, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం కాపాడడంతో పాటు బలవర్ధకమైన పౌష్టికాహారం అందించి మహిళల్లో రక్తహీనత నుంచి కాపాడడంపై దృష్టి పెట్టాలని కర్ణాటక రాష్ట్ర పిల్లల హక్కుల రక్షణ కమిషన్ అధ్యక్షుడు కె.నాగణ్ణ గౌడ వైద్యులకు సూచించారు. మంగళవారం బిమ్స్ సభాంగణంలో జిల్లా పిల్లల రక్షణ విభాగం, ఆరోగ్య, విద్య మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కళ్యాణ కర్ణాటక విభాగంలో గర్భిణీలు, బాలింతల పోషణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో గర్భిణుల మరణాలు శోచనీయమన్నారు. జిల్లా ప్రాథమిక సముదాయ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స కోసం వచ్చే గర్భిణీ మహిళలకు ముఖ్యంగా పౌష్టిక ఆహారం, అనీమియా లాంటి వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. జాతీయ బాలల సంక్షరణా కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాల లోపు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య నిపుణులతో చికిత్స అందించాలన్నారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి గర్భిణీ, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా సహాయాధికారి ఝుబేరా మాట్లాడుతూ జిల్లాలో ప్రతినెలా ప్రధానమంత్రి మాతృత్వ సురక్షతా వందా కార్యక్రమంలో భాగంగా గర్భిణీల ఆరోగ్య కేంద్రాల్లో పౌష్టిక ఆహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టే దిశలో అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. బాల్య వివాహం చేయడానికి ముందుకు వచ్చే తల్లితండ్రులకు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు ఇళ్ళ వద్దకు వెళ్ళి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ యల్లా రమేష్ బాబు, జిల్లా సర్జన్ డాక్టర్ బసరెడ్డి, బిమ్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ్ కుమార్, ఆహార పౌరసరఫరా అధికారి సకీనా, సాంఘీక సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లికార్జున, జిల్లా కార్మిక శాఖ అధికారి సిద్దప్ప, ఖైనూరు, జిల్లా బాల కార్మిక యోజనాధికారి మౌనేష్, జిల్లా పిల్లల రక్షణ విభాగం అధికారి నాగప్ప జిల్లా అధికారులు పాల్గొన్నారు.

11న కనకదుర్గమ్మ సిడిబండి మహోత్సవం

- 2 నుంచి 3 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం
- ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలి : ఎమ్మెల్యే నారా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ సిడిబండి మహోత్సవాన్ని మార్చి 11న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని బళ్లారి నగర ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి అధికారులకు సూచించారు. సిడిబండి ఏర్పాట్లపై మంగళవారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నగర దేవత పండుగను సాంప్రదాయ పద్దతిలో జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంపై గాణిగ సమాజం సలహా తీసుకోవాలని ఆయన ఆలయ కార్య నిర్వాహక అధికారులకు సూచించారు. రథోత్సవానికి దాదాపు 3నుంచి 4లక్షలమంది వస్తారని తాగునీరు, క్యూయింగ్, పార్కింగ్, విద్యుత్‌సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి: కలెక్టర్

కనకదుర్గమ్మ దర్శనార్థం వచ్చే భక్తులకు స్వచ్ఛమైన తాగునీరందించాలని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. నీటిని సరఫరా చేసే ట్యాంకర్లను శుభ్రం చేసి పరీక్షించిన తర్వాతే నీటిని సరఫరా చేయాలన్నారు. ఆహారాన్ని పరీక్షించాలని ఆయన ఆరోగ్య అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత పాటించాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసి నిర్వహించాలని ఆయన మున్సిపల్ కార్పోరేషన్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా చూసుకోవాలని జెస్కాం శాఖ అధికారులను ఆదేశించారు.

భక్తులకు ఇబ్బంది కలిగించరాదు: ఎస్పీ

అమ్మవారి దర్శనం కోసం ప్రజలు, భక్తులు వరుసల్లో నిలబడకుండా నిరోధించడానికి బారికేడ్లు, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్పీ శోభరాణి అన్నారు. ఆలయ ప్రాంగణంలో హెల్ప్‌లైన్‌ను తెరవాలని, అగ్నిమాపక దళాన్ని సిద్దంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు కోళ్లను జ్యోతి రథంలోకి విసిరేయకూడదని, ఇది చట్టవిరుద్ధమన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ ముల్లంగి నందీశ్, ఆలయ కార్యనిర్వాహణాధికారి హనుమంతప్ప, గాణిగ సంఘం సభ్యులు, వివిధ జిల్లాస్థాయి విభాగాల అధికారులు ,మున్సిపల్ కార్పోరేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి

నూతన పారిశ్రామిక వేత్తలకు సహకారం

- వాణిజ్య మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కొత్త పారిశ్రామిక వేత్తలకు తగినసహకారం, మార్గదర్శకత్వం అందిస్తామని బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి అన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, జేఐటీఓ బిజినెస్ నెట్‌వర్క్ సంయుక్త ఆధ్వర్యంలో బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలిలో సోమవారం వ్యాపార వ్యవస్థాపకుల ఎడ్జ్, సాధికారత, పరిణామం అను అంశంపై సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కొత్త వ్యవస్థాపకులు ఏదైన పెట్టుబడి పెట్టే ముందు వారు ప్రారంభించాలనుకుంటున్నవ్యాపారం యొక్క మూలధనపెట్టుబడి,ముడి పదార్థాల అమ్మకాలు, పూర్తయిన వస్తువులు మార్కెటింగ్ వ్యవస్థ మొదలైన వాటిపై సమగ్ర అధ్యయనం చేయడం మంచిదన్నారు. జిల్లాపారిశ్రామిక కేంద్రం జాయింట్ డైరెక్టర్ రిసోర్స్ పర్సన్లు సోమశేఖర్ మాట్లాడుతూ.. కొత్త వ్యాపారాలు ప్రారంభించేముందు ప్రభుత్వ మద్దతు, ఆర్థిక సౌకర్యాలు, సబ్సిడీలపై సమగ్ర సమాచారాన్ని అందించారు. ఈసందర్భంగా జేఐటీఓ యూత్ మండలి, బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి ఛైర్మన్ దినేశ్ జైన్,మంజునాథ్, దొడ్డనగౌడ, సొంతగిరధర,జాయింట్ సెక్రటరీలు రామచంద్ర, నాగల్లి రామ్, శ్రీనివాసరావు హాజరయ్యారు.

పిల్లల్లో రక్తహీనతను నివారించాలి

- హెల్త్ ఆఫీసర్ మంజునాథ్
- విద్యార్థులకు రక్తపరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పిల్లలలో రక్తహీనత స్థాయిని గుర్తించడంలో హిమోగ్లోబిన్ పరీక్ష సహాయపడుతుందని సంజీవరాయనకోట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మంజునాథ్ అన్నారు. మంగళవారం తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిడగినమొళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహించిన 'రక్తహీనత రహిత భారత్ 'కార్యక్రమంలో ఆయన మాట్లాడారు."పిల్లల్లో పోషకాహార లోపం వల్ల రక్తహీనత వస్తుంది. అందువల్ల సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి మాట్లాడుతూ పౌష్టి కాహారం తీసుకుంటే పిల్లల్లో హిమోగ్లోబిన్ స్థాయి పెరుగుతుందన్నారు. పిల్లలు సరైన సమయంలో ఆహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ హెల్త్ అసిస్టెంట్ దినేశ్, జూనియర్ హెల్త్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, టీచర్ శ్వేత, ఆశా వర్కర్లు యశోద, సుశీల తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా అంగన్‌వాడీ ఆహార పదార్థాల నిల్వ

- 18 మంది కార్యకర్తల సహా 26 మంది అరెస్టు
- హుబ్లీలో పోలీసుల దాడులు



స్వాధీనం చేసుకున్న పౌష్టికాహార ప్యాకెట్లు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పిల్లకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. పిల్లలకు అందాల్సిన ఆహారాన్ని సైతం కొందరు అక్రమ మార్గంలో తరలించి అమ్ముకుంటున్నారు. భారీ ప్రమాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఘటనలో 18మంది అంగన్‌వాడీ కార్యకర్తలతో సహా, వారికి సహకరించిన 8మందిని మొత్తం 26మందిని హుబ్లీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వీరిలో గోడౌన్ యజమాని, అద్దెకు తీసుకున్న వ్యక్తులను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి హుబ్లీ-ధారవాడ పోలీసు కమిషనర్ శశికుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15వ తేదీన మహిళా శిశు సంక్షేమ శాఖకు అందిన సమచారా మేరకు శాఖ అధికారులతో కలిసి ఓ గోడౌన్‌పై దాడి చేసారు. గోడౌన్‌లో పిల్లలకు, గర్భిణీలకు పంపిణీ చేయాల్సిన ఆహార పదార్థాల పొట్లాలు భారీ ప్రమాణంలో నిలువ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు అధికారులు కసబా పేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు ఘటనకు సంబంధించి పూర్వపరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆహార పదార్థాల్లో గోదుమ రవ్వ, పాలపొడి, బెల్లం, పెసలు, బియ్యంతో పాటు సుమారు రూ.4లక్షల విలువైన ఆహార పదార్థాలు జప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. గోడౌన్‌యజమాని, గోడౌన్‌ను అద్దెకు తీసుకున్న వారితో సహా మొత్తం 8మందిని మొదట అరెస్టు చేయగా, వారి నుంచి సమాచారంసేకరించిన అనంతరం 18మంది అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరానికి మించి ఆహార పదార్థాల పొట్లాలు సేకరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. మొత్తం 26 మందిని అరెస్ట్ చేశారు. కేసును తీవ్రంగా పరిగణించిన పోలీసులు ఇద్దరు ప్రధాన సూత్రదారులను గుర్తించారు. సూత్రదారులు ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసుల సమాచారం. మొత్తం నాలుగు విభాగాల నుంచి ఆహార ధాన్యాలను సంగ్రహించినట్లు పోలీసుల సమాచారం. పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆహార పదార్థాల్లో 329 బ్యాగుల్లో 8.84టన్నుల ఆహార పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజలో ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్

గంగావతి రూరల్ ,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కొప్పళ తాలూకాలోని హనుమానహళ్ళి, కాలికేరి, హట్టి దేవలాపూర్, చిల్వడగి గ్రామాల్లో రూ. 5.47కోట్ల విలువైన వివిధ పనులకు ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్ భూమిపూజ చేశారు. తదుపరి కాలికేరి గ్రామంలో రూ.1.50కోట్ల వ్యయంతో చెరువు నింపే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులు నింపితేనే రైతులకు ఎంతో ప్రయోజనమన్నారు. 15రోజుల కిందట అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన బహదూర్‌బంది నవలకల్ ఇరిగేషన్ ప్రాజెక్టును పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామన్నారు. బహదూర్ బండిలోని హొసల్లి సరస్సుకు నీటిని మళ్ళించే పని జరుగుతోందన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రసన్న, రామన్న, పీఎల్‌డీ బ్యాంక్ అధ్యక్షుడు రామన్న, కల్లన్నవర్,గ్యారంటీ కమిటీ అధ్యక్షుడు బాలచంద్రన్,తోటప్పకామనూర్, శివన్న, పంపన్నహూజార్, మంజునాథ్, సోమశేఖర్ హిట్నాల్, యల్లప్ప, ముక్కన్న, తహశిల్దార్ విఠల్ చౌగులే, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో సౌకర్యాలు కల్పించండి

- పురసభ సామాన్య సమావేశంలో ఎమ్మెల్యే గణేష్



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 23 వార్డుల్లో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కౌన్సిలర్లు మౌలిక సదుపాయాలు కల్పించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పేర్కొన్నారు. పట్టణంలోని పురసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సామాన్య సభలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవిలో వార్డుల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, నదిలో మోటార్లు అదనంగా ఉంచుకుని ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. వీధిలైట్లు, సీసీ రోడ్లు, మురికికాలువ పరిశుభ్రత పనుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. పురసభ అధ్యక్షుడు బట్టాప్రసాద్ మాట్లాడుతూ వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టామన్నారు. వీఆర్ హనుమంతు మాట్లాడుతూ పురసభ పక్కన వున్న డీఎస్పీ పాఠశాల అది మున్సిపాల్టీ ఆస్తి, వెంటనే ఆ స్థలంలో పాఠశాలను మరో చోటికి మార్చి ఆ స్థలాన్ని ఖాళీ చేసి అక్కడ షాపులు ఏర్పాటు చేస్తే పురసభకు మరింత ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అధికారి ఉపాధ్యక్షురాలు సుశీలమ్మ, దుర్గన్న, లడ్డూ వలీ, రామాంజినేయులు, మౌలా ఆంజనేయ, సుమ, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్థాయీ సమితి అధ్యక్షుడిగా ఉస్మాన్

పట్టణంలోని 18వ వార్డుకు చెందిన ఎం ఉస్మాన్‌ను సోమవారం ఎమ్మెల్యే గణేష్, అధ్యక్షులు బట్టాప్రసాద్ నేతృత్వంలో స్థాయి సమితి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉస్మాన్ మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి స్థాయి సమితి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం హర్షణీయమన్నారు. పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

హోసూరు జోన్

అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ



భూమిపూజలో మంత్రి చక్రపాణి, కలెక్టర్ దినేశ్‌కుమార్ తదితరులు


హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని కావేరిపట్టణ పంచాయతీ యూనియన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు మంత్రి చక్రపాణి భూమిపూజ చేశారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ కవిత, సహకార సంఘాల జోనల్ కో ఆర్డినేటర్ నటరాజన్, జిల్లా సరఫరా అధికారిణి గీతారాణి ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు సిటీ బస్సులలో ఉచిత ప్రయాణం, మహిళలకు ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున 1.15 లక్షల మంది మహిళలకు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 1.50లక్షల మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి అల్పాహార పథకం క్రింద అల్పాహారం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆమోదించిన 650ఆసుపత్రుల్లో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి గంటల్లోనే ఉచిత చికిత్స అందించి 3 లక్షల మంది ప్రాణాలు కాపాడారన్నారు. ఇలా తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో తమిళనాడు వినియోగ వస్తువుల వాణిజ్య సంస్థ రీజనల్ మేనేజర్ శక్తి సరళ్, ప్రజాపంపిణీ ప్రాజెక్టు డిప్యూటీ సెక్రటరీ దవమణి, మహాదేవన్, కుమార్, సుబ్రహ్మణి, రాణి, సరవణన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

నాలుగో అంతస్తు నుంచి జారిపడి బాలిక మృతి

హోసూరు (క్రైం), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో ఓ ఇంటి నాలుగో అంతస్తు నుంచి జారి పడి బాలిక దుర్మరణం చెందింది. స్థానికంగా మూవేందర్‌నగర్‌లో ఉంటున్న శరవణన్ బెంగళూరులోని ఓ ప్రైవేట్ సంస్థలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. పదోతరగతి చదువుతున్న కుమార్తె యాషిని(16) కాలు జారి హఠాత్తుగా జారి కింద పడింది. తక్షణమే బాలికను హోసూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగళూరు లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఘటనపై హడ్కో పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

రైల్వే గేటు మూసివేత


ముదిగుబ్బ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి వెళ్లే రహదారిలో ఉన్న పాతూరుగేట్‌కు మరమ్మతుల కారణంగా ఈ నెల 22, 23 తేదీల్లో మూసివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ కదిరి సెక్షన్ ఇంజనీర్ అప్సార్‌బాషా తెలిపారు. వాహనదారులు గమనించాలని ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేయాలని ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, ముదిగుబ్బ తహసీల్దార్ నారాయణ స్వామి, సీఐ శివరాముడుకు సమాచారం ఇచ్చామన్నారు.



ఊరేగింపులో చంద్రచూడేశ్వర స్వామి

వైభవంగా గ్రామదేవతల పల్లకి ఉత్సవం

హోసూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామదేవతల పల్లకీ ఊరేగింపు సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు వైభవంగా జరిగింది. ఉత్సవంలో గణపతి, మరగతాంబ చంద్రచూడేశ్వరస్వామి, బండాంజనేయస్వామి, కోటమారియమ్మ, ద్రౌపతీదేవి అమ్మవారి పూల కరగం, ఇసుక మారియమ్మ, కపాలమ్మ, నంజుండేశ్వరస్వామి, కాళియమ్మ తదితర దేవతలను హోసూరు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి రథోత్సవం ఊరేగించారు. ప్రత్యేకించి కరగధారి వెంట కత్తులతో వీరయువకులు వెంట వెళ్లారు. పల్లకీల ఉత్సవాన్ని వీక్షించేందుకు సరిహద్దులోని జిల్లానుంచేకాక కర్ణాటకకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 35కు పైగా గ్రామదేవతలను ఊరేగించారు. మార్చి 13న ప్రారంభమయ్యే హోసూరు శ్రీ చంద్రచూడేశ్వర రథోత్సవానికి ముందు ఈ పల్లకీ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. వాయిద్యాల నడుమ పురవీధులలో పల్లకి ఉత్సవం ఎంతో వైభవంగా జరిగింది.



ఊరేగింపులో శివపార్వతులు



నంజుండేశ్వరస్వామి, కాళికమ్మ